తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

08-05-2026

శుక్రవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 95

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /-


కరోనా మనుషుల ప్రాణాలు తీస్తే..

## కాంగ్రెస్ రైతుల ఉసురు తీస్తోంది!

- వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే
- రైతులను కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడారు
- కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టం
- కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్
- కోదాడ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

2





## కరీంనగర్ కదనరంగం

- డ్రగ్స్ ఆరోపణలతో మొదలైన మాటల యుద్ధం..
- "బట్టతల" కామెంట్స్‌తో బీజేపీ శ్రేణుల ఆగ్రహం
- కరీంనగర్‌లో హింసాత్మక ఘర్షణలకు ఆజ్యం
- గంగుల క్యాంప్ ఆఫీసుపై బీజేపీ కార్యకర్తలు
- లాఠీచార్జి చేసి చెదరగొట్టిన పోలీసులు

3

## ప్రజాబాటలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ

- క్షేత్రస్థాయి సమస్యలపై 'పొలం బాట'
- రైతులతో ముఖాముఖీ.. సమస్యలపై ఆరా
- పీఎం కుసుమ్ పథకంపై అవగాహన
- సౌర విద్యుత్‌తో రైతులకు ఆర్థిక భరోసా
- మోడల్ సోలార్ విలేజ్‌గా గుండాల గ్రామం

2



# ఆర్టీజన్ల డిమాండ్లు నెరవేరేనా?


### నేడు ఇంధనశాఖ కార్యదర్శితో టీజాక్ కీలక చర్చలు



- నెల గడిచినా వెలువడని ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు
- ఒకే సంస్థ ఒకే విధానమే ప్రధాన డిమాండ్
- 2017 కార్మిక శాఖ ఒప్పందాన్ని అమలు చేయాలి
- విద్యార్హతల ఆధారంగా ఉద్యోగ కన్వర్షన్ చేపట్టాలి
- మెడికల్ ఈఎల్ బెనిఫిట్స్ బోర్డు నిబంధనల ప్రకారం ఇవ్వాలి

**తెలంగాణ బ్యూరో, మే 7, (సిరి న్యూస్):** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రంగంలో కీలక భూమిక పోషిస్తున్న 20 వేల మంది ఆర్టీజన్ల భవిష్యత్తు నేడు తేలనుంది. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత నెలలో సమ్మె బాట పట్టిన కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో ఇంధనశాఖ కార్యదర్శితో టీజాక్ ప్రతినిధులు జరపబోయే చర్చలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సరిగ్గా నెల రోజుల క్రితం, ఏప్రిల్ 8న విద్యుత్ శాఖలోని 20 వేల మంది ఆర్టీజన్లు ఆరు ప్రధాన డిమాండ్లతో సమ్మెకు దిగారు.

2



# అర్ధరాత్రి

### ఐస్ క్రీమ్ కావాలంటూ..

## పోలీసు బాస్ హుకుం!

### దుకాణాలు మనమే బంజేపిస్తాం సర్ అన్నందుకు ఎస్ఐపై తిట్ల దండకం

**సమయం 12:30 ఒక పోలీస్ ఉన్నతాధికారి తన కింద పనిచేసే ఒక ఎస్ఐ కి ఫోన్ చేసాడు, ఇప్పుడు నాకు ఐస్ క్రీం కావాలి తీసుకోని రా అని హుకుం జారీ చేసాడు. అందుకు ఆ ఎస్ఐ సర్ మనమే అన్ని దుకాణాలను 12 లోపే మూసేయిస్తాం ఇప్పుడు ఒక్క దుకాణం కూడా తెరిచివుండదని బదులిచ్చాడట, అంతే సదరు అధికారి ఆగ్రహంతో ఊగిపోతు ఆ ఎస్ఐ పై తిట్ల దండకం అందుకున్నాడట. నోటి కొచ్చిన బూతులతో సదరు ఎస్ఐ ని తిట్టాడట. ఎస్ఐ వాస్తవ పరిస్థితిని తెలిజేస్తుంటే కనీసం వినే ప్రయత్నం చేయకుండా నేను చెప్పిన పని చేయనంటావా నీ సంగతి చూస్తా అంటూ ఫోన్ కట్ చేసాడట!**

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్**

ఇదంతా ఫోన్లో రికార్డు అవ్వడం పోలీస్ శాఖ గ్రూపుల్లో వైరల్ అవ్వడంతో ఇప్పుడు ఆ అధికారి తీరు ఆ శాఖలో హాట్ టాపిక్ అట !హైదరాబాద్ మహానగరంలో డీసీపీ గా పనిచేస్తున్న ఆ అధికారి కిందిస్థాయి ఉద్యోగులపై ఎప్పుడు గుర్రుగా ఉంటాడట తాను చెప్పిన పని చేయకుంటే వాళ్ళను ఫలానా కేసులో బాగా నొక్కావట కదా అంటూ బహిరంగానే అడుగుతాడట. ఇక అయన పనిచేసే ఏసీపీ ఐనా సీఐ ఐనా ఎస్ఐ ఐనా సరే అయన ఎం చెబితే అది చేలసిందేనట లేదంటే తిప్పలు తప్పవని ఆ శాఖ వర్గాలే చెబుతున్నాయ్. ఇటీవల జరిగిన ఐస్ క్రీం సంఘటనతో అయన నిజస్వరూపం మొత్తం బహిర్గతమైందని పోలీస్ వర్గాల్లో పెద్ద చర్చ. ఉన్నత స్థాయిలో ఉన్న ఆ అధికారి కేవలం ఐస్ క్రీం చేసిన రచ్చ మరో రెండేళ్లలో పదవీవిరమణ చేయనున్న ఆయనకు పెద్ద మచ్చగా మారింది.

మిగతా 3 లో

- నగరంలో ఓ డీసీపీ దాదాగిరి
- కిందిస్థాయి ఉద్యోగులపై జులుం
- చెప్పింది చేయకుంటే శాఖాపరమైన చర్యలు
- భరించలేని భాష..
- సహించలేని చేష్టలు
- ప్రభుత్వం ఏదైనా ఆయన పదవి మాత్రం పదిలమట
- 1991 బ్యాచ్ అధికారి ఐపీఎస్ పదోన్నతిపైనా ఆరోపణలు
- ప్రస్తుత ప్రభుత్వానికి సైతం అత్యంత సన్నిహితుడట
- ఉప ఎన్నికల్లో నేనే గెలిపించానంటూ బహిరంగానే చెబుతాడట

# మహిళా సంఘాలకు సీతక్క శుభవార్త

### వడ్డీలేని రుణాలు 5 నుంచి పది లక్షలకు పెంపు

### ఈ మొత్తంలకు ప్రభుత్వమే వడ్డీల చెల్లింపు

### పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి



2

మహిళా స్వయం సహాయక బృందాలకు మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. ప్రతి ఒక గ్రూపునకు వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక బృందాలతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షలు బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు.



ఫార్మా సిటీ రైతుల పక్షాన

## పోరాడుతాం

బషీర్‌బాగ్ అఖిలపక్ష సమావేశంలో కవిత హెచ్చరిక

3

కొండా సురేఖ వ్యాఖ్యలు

## అభ్యంతరకరం

- ఎండోమెంట్ మంత్రిగా ఇలానేనా వ్యాఖ్యానించేది
- మండిపడ్డ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

3



# ప్రాణాలు తీసిన ఈత సరదా

### హల్దీ వాగులో మునిగి ముగ్గురు మృతి

### శుభకార్యానికి వెళ్లి శవాలై తిరిగొచ్చిన వైనం

### నర్సాపూర్‌లో మిన్నంటిన రోదనలు



.. వివరాలు 2లో




డ్రగ్స్ కేసులో పట్టుబడితే

## పీడీ యాక్ట్

- డ్రగ్స్ సరఫరా చేస్తోన్న వారి ఆస్తులూ సీజ్
- డ్రగ్స్ వినియోగం కట్టడే తొలి ప్రాధాన్యం
- యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే ఆ యజమాన్యాలపై చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా డీ అడిక్షన్ సెంటర్లు
- ఈగల్ ఫోర్స్‌పై సమీక్షలో డీజీపీ సీవీ ఆనంద్

వివరాలు 2వ పేజీలో



# సామాన్యుడిలా సీఎం కాన్వాయ్!

**విమానాశ్రయం నుంచి ఇంటికి సాధారణ రద్దీలోనే ప్రయాణం**

**పోలీసులకు రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశం**

**హైదరాబాద్, మే 7:** తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజలకు ఆటంకం కలిగించొద్దంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి డీజీపీని బుధవారం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఆయన కాన్వాయ్ సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణం చేసింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి తన నివాసానికి రెగ్యులర్ ట్రాఫిక్‌లోనే సీఎం వెళ్లడం విశేషం. తన కాన్వాయ్ రాకపోకల కోసం నగరవ్యాప్తంగా ప్రజల వాహనాలను నిలిపివేయొద్దంటూ నిన్న సీనియర్ పోలీసు అధికారులకు సీఎం ఆదేశించారు. రోడ్లపై ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యల్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ఈ నేపథ్యంలో సీఎం కాన్వాయ్ కదలికల సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడానికి బదులుగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఒకే లేన్‌లో కదలడానికి అనుమతించారు.

# డ్రగ్స్ కేసులో పట్టుబడితే పీడీ యాక్ట్

**హైదరాబాద్, మే 7:** తరుచూ డ్రగ్స్ కేసులో పట్టుబడిన వారిపై పీడీ యాక్ట్ తరహా చట్టాన్ని ఉపయోగిస్తామని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. డ్రగ్స్ సరఫరా చేస్తోన్న వారిని గుర్తించి వారి ఆస్తులనూ సీజ్ చేస్తా మని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన డ్రగ్స్ వినియోగాన్ని కట్టడి చేయడమే తమ తొలి ప్రాధాన్యమని వెల్లడించారు. నార్కోటిక్స్‌పై తాము అత్యంత అప్రమత్తంగా ఉన్నామని వివరించారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా హైదరాబాద్ లోని తన కార్యాలయంలో ఆయన ఈగల్ ఫోర్స్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఇక నుంచి యూనివర్సిటీలతో పాటు విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే ఆ బాధ్యత యజమాన్యాలదేనని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాల్లో అధికారులు డ్రగ్స్ కేసుల దర్యాప్తు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైందన్నారు. జిల్లాల్లో డ్రగ్స్ కేసుల విచారణపై అధికారులకు ఈగల్ ఫోర్స్ ద్వారా శిక్షణ ఇస్తామని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. పోలీస్ శాఖలోని 35 విభాగాలపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆపరేషన్‌పై ఈ సమీక్షలో చర్చించినట్లు వివరించారు. ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఆపరేషన్‌లు నిర్వహించడం ద్వారా నిందితులను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. డ్రగ్స్ విషయంలో సరఫరాతోపాటు డిమాండ్.. ఈ రెండింటిపై దృష్టి సారించామని పేర్కొన్నారు. కాగా ఈగల్ విభాగంలో లో సిబ్బంది కొరత ఉందన్న ఆయన సివిల్ ఫోర్స్ అవసరం కూడా ఉందని చెప్పారు. జిల్లాలో కమిషనర్లు, ఎస్పీలు కూడా డ్రగ్స్ కట్టడిలో కీలక పాత్ర పోషించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

# కరోనా మనుషుల ప్రాణాలు తీస్తే.. కాంగ్రెస్ రైతుల ఉసురు తీస్తోంది!

**కోదాడ, మే 7 (సిరిన్యూస్):**

కరోనా మనుషుల ప్రాణాలు తీస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు తీస్తోందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రైతులను కంటికి రెప్పలా కాపాడింది కేసీఆర్ ప్రభుత్వమేనని, రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని గునుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలను తీవ్రంగా ఎండగట్టారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు నెలకు రూ.2500, నిరుద్యోగ భృతి వంటి హామీలతో నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు, రిటైర్డ్ ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదని, కేసీఆర్ ప్రభుత్వం మైనారిటీలకు కల్పించిన పలు ప్రయోజనాలను సైతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు బాత్ కరోడో మే.. కామ్ పకోడో మే అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేసిన హరీశ్‌రావు.. మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో మాత్రం శూన్యమని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు సబ్ ప్లాన్ నిధులు సరిగా విడుదల కావడం లేదని, ఎస్సీ–ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా ఈ రెండున్నరేళ్లలో ఒక్కరికి కూడా ప్రయోజనం అందలేదన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో సాగునీటి రంగం విప్లవాత్మకంగా అభివృద్ధి చెందిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలోని పొలాలు పచ్చగా మారాయని చెప్పారు. గతంలో మంత్రిగా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎప్పుడైనా కోదాడకు గోదావరి జలాలు తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఎస్సారెస్పీ ఫేజ్–2 పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందించామని తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయినా మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారని, కానీ గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మాత్రం ఆన్లైన్‌కే పరిమితమయ్యారని హరీశ్‌రావు విమర్శించారు. అసలైన నాయకుడు ఎవరో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ మళ్లీ కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ రైతుబంధు ఆపలేదని హరీశ్‌రావు గుర్తు చేశారు. వడ్ల కొనుగోళ్ల సమయంలో హమాలీలు దొరక్క ఇబ్బందులు తలెత్తగా బీహార్ నుంచి ప్రత్యేక రైళ్లలో కూలీలను తీసుకొచ్చి వడ్ల లోడ్లు దించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కరోనా సమయంలో 93 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను కొనుగోలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేస్తామని చెప్పి ఇప్పటివరకు కేవలం 17 లక్షల టన్నులే కొనుగోలు చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు అడుగడుగునా కష్టాలే మిగిలాయని మండిపడ్డారు. ఎరువుల కొరత, కరెంటు సమస్యలు, సాగునీటి ఇబ్బందులు, పండించిన ధాన్యం అమ్ముకునే పరిస్థితి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. యూరియా అమ్మకాల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు. మొన్నటి వరకు ఆన్లైన్ యాప్‌లు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టారని, ఇప్పుడు ఏకంగా యూరియా అమ్మకాలపైనే నిషేధం విధించి రైతులను మరింత కష్టాల్లోకి నెట్టేశారని అన్నారు. ఢిల్లీ చుట్టూ తిరుగుతున్న సీఎం రేవంత్ రెడ్డి ఒక్కసారైనా ఏసీ గదులు వదిలి వడ్ల కల్లాల వద్దకు వెళ్లి రైతుల కష్టాలు వినాలని డిమాండ్ చేశారు. అమాయకుడైన బీఆర్ఎస్ కార్యకర్త రాజేష్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా పొట్టనబెట్టుకుందని హరీశ్‌రావు ఆరోపించారు. రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీ లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు. తమ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్క అధికారినీ వదిలిపెట్టబోమని, వడ్డీతో సహా చెల్లిస్తామని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# ఆర్టిజన్ల డిమాండ్లు నెరవేరేనా?

- **2026 పీఆర్సీ ప్రయోజనాలు అందరికీ వర్తింపజేయాలని డిమాండ్**
- **చర్చలు విఫలమైతే మళ్లీ పోరాట బాట తప్పదు**

వంటా–వార్పు, ధర్నాలు, కార్యాలయాల ముట్టడితో విద్యుత్ యంత్రాంగం స్తంభించిపోయింది. 10 రోజుల పాటు సాగిన ఈ సమ్మె వల్ల ప్రభుత్వానికి కోట్లలో నష్టం వాటిల్లింది. అయితే ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమించినా, నేటికీ అధికారిక ఉత్తర్వులు వెలువడకపోవడంపై కార్మికుల్లో అసహనం వ్యక్తమవుతోంది.

### నాడు సమ్మె విరమణ.. నేడు చర్చల పర్వం

సమ్మె సమయంలో ప్రభుత్వం చర్చలకు పిలవగా, ట్రాన్స్కో, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీలు చూపిన చొరవతో పరిస్థితి సద్దుమణిగింది. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో ఎటువంటి షరతులు లేకుండానే ఆర్టిజన్లు సమ్మెను విరమించారు. ఆర్థిక భారం లేని డిమాండ్లను తక్షణమే తీరుస్తామని, మిగిలినవి పరిశీలిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఆ హామీల అమలుపై స్పష్టత కోసమే నేటి సమావేశం ఏర్పాటు చేయబడింది. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో టీజాక్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, ప్రొఫెసర్ కోదండరాంలను కలిసి మొరపెట్టుకున్నారు. వారు వెంటనే స్పందించి విద్యుత్ శాఖ మంత్రితో మాట్లాడగా, రెండు రోజుల్లో చర్చలు జరుపుతామని ఆయన వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఇంధనశాఖ కార్యదర్శి కార్యాలయంలో జరగనున్న చర్చలపై ఆర్టిజన్లు గంపెడాశతో ఉన్నారు.

### ఒకే సంస్థ - ఒకే విధానం కావాలి

ఆర్టిజన్ల ప్రధాన డిమాండ్లలో 'ఒకే సంస్థ – ఒకే విధానం' అత్యంత ముఖ్యమైనది. ఒకే శాఖలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా గుర్తించాలని, ఏపీఎస్ఈబి నిబంధనలు తమకూ వర్తింపజేయాలని వారు కోరుతున్నారు. సంస్థ అభివృద్ధిలో సమానంగా శ్రమిస్తున్నప్పుడు నిబంధనల్లో వివక్ష ఎందుకని కార్మిక నేతలు ప్రశ్నిస్తున్నారు.

### 2017 కార్మిక శాఖ ఒప్పందం అమలు

గత ప్రభుత్వం 2017లో 23 వేల మంది అవుట్‌సోర్సింగ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించినప్పుడు కార్మిక శాఖతో ఒక ఒప్పందం కుదిరింది. ఆ నిబంధనల ప్రకారం ప్రతి ఐదేళ్లకు ఒకసారి సీనియారిటీ మరియు రోస్టర్ పద్ధతిన గ్రేడ్ ప్రమోషన్లు కల్పించాలి. ఈ ఒప్పందాన్ని అమలు చేస్తే ఆర్టిజన్లకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని, దీనిపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. ఆర్టిజన్లలో ఐటీఐ నుంచి పీజీ వరకు చదివిన వారు ఎంతో మంది ఉన్నారు. వీరి విద్యార్హతల ఆధారంగా తగిన హోదాల్లోకి కన్వర్షన్ చేయాలని టీజాక్ డిమాండ్ చేస్తోంది. దీనివల్ల సంస్థకు నిపుణులైన సేవలు దొరకడమే కాకుండా, కార్మికులకు వృత్తిపరమైన ఎదుగుదల లభిస్తుందని వారు వివరిస్తున్నారు.

### మెడికల్, ఈఎల్ బెనిఫిట్స్

ప్రాణాలకు తెగించి విద్యుత్ లైన్ల మీద పనిచేసే ఆర్టిజన్లకు బోర్డు నిబంధనల ప్రకారం మెడికల్ ఇన్సూరెన్స్, ఎర్నడ్ లీవ్స్ వంటి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. కుటుంబ భద్రత దృష్ట్యా ఈ సౌకర్యాలను కల్పించాలని వారు కోరుతున్నారు. నేటి చర్చల్లో ఈ ఆరోగ్య భద్రత అంశాలపై సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నారు.

### అన్‌మ్యాన్డ్, పీస్ రేట్ కార్మికుల గోడు

కేవలం ఆర్టిజన్ల సమస్యలే కాకుండా, ఇంకా గుర్తింపునకు నోచుకోని అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని, పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్లు ఉన్నాయి. 2026 పీఆర్సీని వీరందరికీ వర్తింపజేయాలని టీజాక్ పట్టుబడుతోంది. ఈ అట్టడుగు స్థాయి కార్మికుల జీవితాల్లో మార్పు రావాలంటే ప్రభుత్వ సానుకూలత తప్పనిసరి.

# ప్రజాబాటలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:** మొన్నటి వరకు సబ్‌స్టేషన్ల బాట పట్టి ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్న టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్, ఇప్పుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు పొలం బాట పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని గుండాల గ్రామంలో పర్యటించిన ఆయన, రైతుల మధ్య ఒక సామాన్యుడిలా గడిపి, విద్యుత్ సరఫరా మరియు వ్యవసాయ పంపుసెట్ల పనితీరుపై ముఖాముఖీ చర్చించారు. వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ విద్యుత్ అందించడం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యమని ఈ సందర్భంగా సీఎండీ వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేస్తున్న 'పీఎం కుసుమ్ కాంపోనెంట్' పథకం కింద ఎంపిక చేసిన గ్రామాల్లో సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పంపుసెట్లు వాడగా మిగిలిన అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపడం ద్వారా, డిస్కం ఆ విద్యుత్తును కొనుగోలు చేస్తుందని, దీనివల్ల రైతులకు ఏడాది పొడవునా అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు.

### రైతుపై సున్నా భారం.. ఉచిత నిర్వహణ

ఈ మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం కింద ఏర్పాటు చేసే సౌర విద్యుత్ ప్యానెళ్ల వల్ల రైతులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని అధికారులు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంలోని ఎంఎన్ఆర్ఈ ద్వారా 30 శాతం ఆర్థిక సాయం అందగా, మిగిలిన నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అంతేకాకుండా, సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసిన తర్వాత ఐదు సంవత్సరాల పాటు నిర్వహణ మరియు మరమ్మతులు సంబంధిత సంస్థలే ఉచితంగా చేస్తాయని సీఎండీ భరోసా ఇచ్చారు. ఇకపై సాధారణ విద్యుత్ అవసరం లేకుండానే పంపుసెట్లు సోలార్‌తో నడుస్తాయని చెప్పారు.

అధికారుల క్షేత్రస్థాయి పర్యటనకు పెరిగిన స్పందన

ఈ కార్యక్రమంలో సీఎండీ జితేష్ వి పాటిల్‌తో పాటు చీఫ్ ఇంజనీర్ పాండే నాయక్, సైబర్ సిటీ ఎస్సీ చంద్రశేఖర్, డీఈఈ రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్వయంగా పొలాల వద్దకు వచ్చి తమ సమస్యలు వినడం, కొత్త పథకాలపై అవగాహన కల్పించడం పట్ల గుండాల గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సాయంతో సౌర విద్యుత్ వినియోగం పెరిగితే కరెంటు కోతలు, వోల్టేజీ సమస్యల నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మహిళా సంఘాలకు సీతక్క శుభవార్త

- **వడ్డీలేని రుణాలు 5 నుంచి పది లక్షలకు పెంపు**
- **ఈ మొత్తలకు ప్రభుత్వమే వడ్డీల చెల్లింపు**
- **పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి**




**హైదరాబాద్, మే 7:** మహిళా స్వయం సహాయక బృందాలకు మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. ప్రతి ఒక గ్రూపునకు వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక బృందాలతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షలు బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల రుణాలకు ఈ ఏడాది వడ్డీల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తామని వివరించారు. అప్పటి వరకు అర్హత గల మహిళా సంఘాలకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కల్పించామన్నారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నామని వివరించారు. మహిళలపై భారాన్ని దించేందుకు వడ్డీ లేకుండా రెట్టింపు లోన్లు ఇస్తున్నామన్నారు. బ్యాంకులకు రీ పేమెంట్ బాగా చేస్తున్నారంటూ మహిళా సంఘాలపై ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రశంసలు కురిపించారు.మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి అన్న నినాదంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం యజ్ఞంలా తామంతా పని చేస్తున్నామని వివరించారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకే వడ్డీ లేని రుణాలు ఇప్పించి ఆర్థికంగా మహిళలను ఎదిగేలా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో తాము పనిచేస్తున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. 40 శాతం పంట కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించామని గుర్తు చేశారు. ఏడాది రూ. 26 వేల కోట్లకు పైగా మహిళలకు బ్యాంకు రుణాలుగా అందిస్తున్నట్లు మంత్రి సీతక్క వివరించారు. మహిళల ఆర్థిక సాధికారతలో ఇది ఒక మైలురాయి అని అభివర్ణించారు. ఇది లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో మహిళలకు పట్టుమని రూ. పది వేల లోన్ ద్వారా లభించేవి కాదన్నారు. ఇప్పుడు అదే మహిళలకి బ్యాంకులు లక్షలాది రూపాయలు లోన్ రూపంలో అందిస్తున్నాయని వివరించారు. పేదరికం వల్లే తాను నక్సలైట్లలో చేరానని ఈ సందర్భంగా సీతక్క గుర్తు చేసుకున్నారు. వడ్డీ వ్యాపారుల దోపిడి కారణంగా సామాన్యులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి బాధ చూడ లేక తాను తుపాకీ పట్టానని వివరించారు. ఆ అనుభవంతోనే మహిళలకు వడ్డీ లేని రుణాలు కల్పించాలనే సంకల్పంతో తాము పని చేస్తున్నామని మహిళా స్వయం సహాయక బృందాలకు మంత్రి సీతక్క తెలిపారు. నిర్మల్ జిల్లా జీరో ఎన్‌పీఏ సాధించిందని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ విజయలక్ష్మిని మంత్రి సీతక్క అభినందించారు. నిర్మల్ జిల్లా తరహాలోనే అన్ని జిల్లాలు వంద శాతం బ్యాంకులకు రీపేమెంట్ చేయాలని సూచించారు. బ్యాంకర్ల నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టాలని మహిళా సంఘాలకు మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు సరళమైన పద్ధతిలో లోన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా బ్యాంకర్లకు మంత్రి సూచించారు. బ్యాంకులకు తాము గ్యారెంటీ ఇస్తున్నామని చెప్పారు. పూర్తిస్థాయిలో రీపేమెంట్ చేసే బాధ్యత తమదన్నారు. వ్యక్తులకు లోన్ ఇస్తే ఎగ్గొట్టే ప్రమాదం ఉంటుందని.. అదే మహిళా శక్తికి సహకరిస్తే మీ నగదుకు భద్రత లభిస్తుందని మంత్రి సీతక్క తెలిపారు.

# ప్రాణాలు తీసిన ఈత సరదా

**హల్దీ వాగులో మునిగి ముగ్గురి మృతి**

**శుభకార్యానికి వెళ్లి శవాలై తిరిగొచ్చిన వైనం**

**నర్సాపూర్‌లో మిన్నంటిన రోదనలు**



**సిద్దిపేట, మే 7:** సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు యువకులు హల్దీ వాగులో మునిగి ప్రాణాలు కోల్పోయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఒక శుభకార్యానికి హాజరై, ఆ సంతోషాన్ని పంచుకోవాల్సిన యువకులు విగతజీవులుగా మారడంతో వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ప్రశాంత్ (27), వికాస్ (27), ఆనంద్ రెడ్డి (27) అనే ముగ్గురు స్నేహితులు బుధవారం నాడు మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగిన ఒక పెళ్లి వేడుకకు హాజరయ్యారు. వివాహ వేడుక అనంతరం, గురువారం ఉదయం తిరుగు ప్రయాణంలో సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం సమీపంలోని హల్దీ వాగు వద్దకు చేరుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో.. సరదాగా వాగులో ఈత కొట్టాలని నిర్ణయించు కున్నారు. వాగులోకి దిగిన ఈ ముగ్గురు స్నేహితులకు నీటి లోతుపై అవగాహన లేకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. గల్లంతైన యువకుల కోసం స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం పోలీసులు, గజ ఈతగాళ్ల సహాయంతో గాలించగా.. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతులంతా ఒకే వయసు వారు (27 ఏళ్లు) కావడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒకే ఊరికి చెందిన ముగ్గురు యువకులు, అందులోనూ ప్రాణ స్నేహితులు ఇలా ఒకేసారి మృతి చెందడంతో నర్సాపూర్‌లో విషాదం నెలకొంది. పెళ్లికి వెళ్లి వస్తామని చెప్పిన కొడుకులు శవాలై రావడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జలాశయాలు, వాగుల వద్దకు వెళ్లేటప్పుడు యువత అప్రమత్తంగా ఉండాలని, నీటి లోతు తెలియకుండా లోపలికి వెళ్లడం ప్రాణాంతకమని ఈ ఘటన మరోసారి హెచ్చరిస్తోంది.

# కరీంనగర్ కదనరంగం

- డ్రగ్స్ ఆరోపణలతో మొదలైన మాటల యుద్ధం
- "బట్టతల" కామెంట్స్‌తో బీజేపీ శ్రేణుల ఆగ్రహం
- కరీంనగర్‌లో హింసాత్మక ఘర్షణలకు ఆజ్యం
- గంగుల క్యాంప్ ఆఫీసుపై బీజేపీ కార్యకర్తలు
- లాఠీచార్జి చేసి చెదరగొట్టిన పోలీసులు
- సిరిసిల్ల నుంచి కరీంనగర్ వరకు ఉద్రిక్తత
- బీజేపీ-బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట
- రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా ఘర్షణలు





**కరీంనగర్, మే 7:** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ నేతల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం ఇప్పుడు ప్రత్యక్ష ఘర్షణలకు దారితీసి రాష్ట్ర రాజకీయాల్లో భారీ కలకలం రేపుతోంది. కేటీఆర్‌పై బండి సంజయ్ చేసిన డ్రగ్స్ ఆరోపణలతో మొదలైన వివాదం.. ఇప్పుడు బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్ రాజకీయ సమరంగా మారిపోయింది. పరస్పర ఆరోపణలు, దాడులు, నిరసనలు, పోలీసుల జోక్యంతో కరీంనగర్ జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటున్నారని.. ఆయన డ్రగ్స్ టెస్టుకు రావాలని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో పెద్ద దుమారాన్ని రేపాయి. ఈ వ్యాఖ్యలకు బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా స్పందించగా.. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బండి సంజయ్‌పై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. "డ్రగ్స్ గురించి మాట్లాడే ముందు బండి సంజయ్ తానే ముందుగా టెస్టుకు రావాలి. తంబాకులో డ్రగ్స్ కలిపి తీసుకోవడం వల్లే ఆయనకు బట్టతల వచ్చింది" అంటూ చేసిన కామెంట్స్ రాజకీయ వర్గాల్లో అగ్గి రాజేశాయి. అంతేకాదు.. గతంలో ఎన్నికల ఖర్చుల కోసం భార్య పుస్తెలు అమ్ముకున్నానని చెప్పుకున్న బండి సంజయ్ ఇప్పుడు వేల కోట్ల రూపాయలు ఎలా సంపాదించారో చెప్పాలని కూడా కౌశిక్ రెడ్డి సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యల తర్వాత పరిస్థితి ఒక్కసారిగా అదుపుతప్పింది. కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. కౌశిక్ రెడ్డి అక్కడ మీడియా సమావేశం నిర్వహిస్తున్న సమయంలోనే భారీ సంఖ్యలో చేరుకున్న బీజేపీ కార్యకర్తలు కార్యాలయాన్ని ముట్టడించినట్లు సమాచారం. అక్కడ నిలిపి ఉన్న కార్లపై కర్రలు, రాళ్లతో దాడి చేసి అద్దాలు ధ్వంసం చేసినట్లు బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలోని ఫర్నిచర్‌ను కూడా ధ్వంసం చేశారనే సమాచారం వెలువడింది. "బండి సంజయ్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలి" అంటూ బీజేపీ శ్రేణులు ఆగ్రహావేశాలతో నినాదాలు చేశారు. ఘటన తీవ్రరూపం దాల్చడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఇరువర్గాలను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించే సమయంలో తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి మరింత విషమించకుండా పోలీసులు లాఠీచార్జ్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో పలువురు కార్యకర్తలకు స్వల్ప గాయాలు అయినట్లు తెలుస్తోంది. అనంతరం గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయం పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, అదనపు పోలీస్ బలగాలను మోహరించారు. కరీంనగర్ పట్టణంలో హై అలర్ట్ ప్రకటించి, అల్లర్లకు పాల్పడిన వారిని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా బండి సంజయ్ సిరిసిల్ల పర్యటన కూడా ఉద్రిక్తతలకు దారితీసింది. ఆయన పర్యటనను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించగా.. పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిరిసిల్లలో కూడా భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు రోడ్లపైకి రావడంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ మొత్తం వ్యవహారంపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. ప్రజాప్రతినిధులపై భౌతిక దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీఆర్ఎస్ మండిపడుతుండగా.. కేంద్ర మంత్రిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడంతో కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు కౌశిక్ రెడ్డి మాత్రం తనపై హత్యాయత్నం జరిగిందని, బండి సంజయ్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ దాడుల వెనుక ఉన్నారని సంచలన ఆరోపణలు చేశారు. ప్రస్తుతం డ్రగ్స్ ఆరోపణల చుట్టూ తిరుగుతున్న ఈ రాజకీయ యుద్ధం తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కిస్తోంది. మాటల దాడులు ఇప్పుడు భౌతిక ఘర్షణలకు దారితీయడం ఆందోళన కలిగిస్తోంది. రాజకీయ నాయకులు తమ భాషను నియంత్రించుకోకపోతే పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కరీంనగర్‌లో కొనసాగుతున్న ఈ రాజకీయ రచ్చ ఇకపై ఎలాంటి మలుపులు తిరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

### 13 మందిపై కేసు

**కరీంనగర్, మే 7:** నగరంలోని స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు గంగుల కమలాకర్ కార్యాలయంపై దాడి ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జి రాజు ఫిర్యాదు మేరకు ఈ దాడికి పాల్పడినట్లు భావిస్తున్న 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించి, వారిపై బీఎన్ఎస్ 189, 191(3), 329(4), 324(4), 292, 351(2) ఆర్/డబ్ల్యూ 190 సహా పీడీ యాక్ట్ కింద పోలీసులు కేసు కట్టారు.



## కొండా సురేఖ వ్యాఖ్యలు అభ్యంతరకరం

### ఎండోమెంట్ మంత్రిగా ఇలానేనా వ్యాఖ్యానించేది

### మండిపడ్డ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్, మే 7:** జై శ్రీ రామ్ అంటే పై నుంచి పైసలు పడతాయా అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండోమెంట్ మంత్రి అంటే దేవుడికి మినిస్టర్‌లాగా ఉండాలని.. కానీ కొండా సురేఖ ఏ శాఖకు మంత్రి? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం హైదరాబాద్ లో రాజాసింగ్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గతంలో ఏబీవీపీలో ఉన్నప్పుడు జై శ్రీరాం అన్నారని ప్రస్తావించారు. మరి ఇప్పుడు తన మంత్రికి జై శ్రీరాం గురించి నేర్పించలేదా..? అని నిలదీశారు. జై శ్రీరాం అంటే కొండంత బలం వస్తోందని...కానీ అనుచితంగా మాట్లాడితే మంత్రి పదవి పోతుందని ఆమెకు చెప్పాలని అన్నారు. తెలంగాణలో దేవుడి భూముల అమ్మకాలు, కబ్జాలు ఎలా జరుగుతున్నాయో చూస్తున్నామని అన్నారు. ఈ విషయంలో కొండా సురేఖ ఎలాంటి చర్యలు చేపట్టారు? అని రాజాసింగ్ ప్రశ్నించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో దేవుడి భూములను ఎంఐఎం నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు వారితో కుమ్మక్కై కమిషన్లు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి దేవాలయాల అభివృద్ధి మీద ధ్యాస లేదని ఆగ్రహించారు. ఎంఐఎం నేతలిచ్చే కమిషన్ల మీదనే ఈ మంత్రికి ధ్యాస ఉందని ఎద్దేవా చేశారు. రాముడి నామాన్ని ఎదిరించడానికి సాహసించేవారు.. ఎవరైనా గాల్లో కొట్టుకుపోతారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, దయచేసి మీ దేవాదాయ శాఖ మంత్రిని పిలిపించి రాజీనామా చేయించాలని హితవు పలికారు. లేకపోతే మీరు కూడా కేసీఆర్ లాగా మునిగిపోతారని రాజాసింగ్ విమర్శించారు.

## అర్ధరాత్రి ఐస్ క్రీమ్ కావాలంటూ..



### బదిలీ ప్రక్రియలో ఆరోపణలు

ఇటీవల ఆ కమిషనరేట్ పరిధిలో 65 మంది సర్కిల్ ఇన్స్పెక్టర్ల బదిలీలకు సంబంధించి అంతా అయన కనుసన్నులోనే ప్రక్రియ సిద్ధం కాగా అందులో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో ఆ బదిలీ ప్రక్రియ ఆగిందట.

### అక్కడ మేం పనిచేయలేం

ఇటీవల ఆ ప్రాంతంలోకి రావాలని కొందరు అధికారులను ఉన్నతాధికారులు అడిగితే అయన పరిధిలో మేము పనిచేయలేం , అక్కడికి బదిలీ చేస్తే దీర్ఘకాలిక సెలవులో వెళతాం అని బహిరంగానే చెప్పారట.దీన్ని బట్టి చూస్తే ఆ అధికారి ప్రవర్తన ఎంతలా పోలీసులకు ఇబ్బందిగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

### ఆ డీసీపీ పదోన్నతి పైన ఆరోపణలు

ప్రభుత్వం ఏదైనా ఫోకల్ పోస్టింగ్ లో ఉండే ఆ అధికారి తీరు మొదటినుండి వివాదాస్పదమట . పనిచేసిన చోటల్లా తన అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ పోలీస్ శాఖలో ఆఫీసర్ కేర్ అఫ్ కాంట్రవర్సీ అనే బిరుదు సంపాదించాడట. ఐతే 1991 ఎస్ఐ బ్యాచ్ కు చెందిన ప్రస్తుత డీసీపీ ప్రమోషన్ లోనే అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయ్.ప్రమోషన్ లలో రెండు పర్యాయాలు యాక్సలరీ ప్రమోషన్ పొందటం పై అప్పట్లో ఆ బ్యాచ్ అధికారులు పిర్యాదులు కూడా చేశారట.ఆలా ఐపిఎస్ గా పదోన్నతి పొందిన సదరు అధికారి ఎక్కడ పనిచేసిన చర్చలోకి వస్తాడంట.ఇలా ఏ ప్రభుత్వం ఉన్న వారికీ అనుకూలంగా ఉండే అధికారిగా పేరుతెచ్చుకొని సదరు డీసీపీ తన దర్పం అలాగే కొనసాగిస్తున్నాడు మరి!

### పిర్యాదులొచ్చినా చర్యలు లేవు !

పోలీస్ శాఖలో ఆ డీసీపీ ప్రవర్తనపై పిర్యాదులు అందిన చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు ఉన్నాయ్. అందుకు కారణం అయన ప్రభుత్వ పెద్దల అండ ఉండటమేనట. నేరుగా ప్రభుత్వ పెద్దలే తనను సంప్రదిస్తున్నపుడు ఇక స్థానిక ఎమ్మెల్యే తో నాకేం పని అంటూ వారిని సైతం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయ్. ఏది ఏమైనా ఒక అధికారి ఐస్ క్రీం కోసం చేసిన ఫోన్ పోలీస్ శాఖకు చెడ్డ పేరు తెస్తుంది. ఇక నేనే సర్కారు అనే అయన తీరు సైతం ప్రభుత్వానికి చెడ్డ పేరును ఆపాదించినట్టే కదా! ప్రభుత్వ పెద్దలారా ఆలోచించండి

## ఫార్మా సిటీ రైతుల పక్షాన పోరాడుతాం

### బషీర్‌బాగ్ అఖిలపక్ష సమావేశంలో కవిత హెచ్చరిక

### భూసేకరణ వెంటనే నిలిపివేయాలని డిమాండ్

### రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం



**హైదరాబాద్, మే 7 :** ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను వెంటనే రైతులకు తిరిగి ఇవ్వాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఫార్మా సిటీ రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో "ఫార్మా సిటీలో ఏం జరుగుతోంది" అంశంపై నిర్వహించిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఫార్మా సిటీ భూసేకరణ కోసం తీసుకొచ్చిన జీవో 31ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల అంగీకారం లేకుండానే భూములు సేకరించారని ఆరోపించారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ పేర్లతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోబోమని హెచ్చరించారు. గత ప్రభుత్వం ఫార్మా సిటీ విషయంలో అసత్యాలు చెప్పిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. కోర్టులో ఒక విధంగా, ప్రజల ముందు మరో విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ రక్షణ సేన ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కవిత మండిపడ్డారు. బుల్లెట్ ట్రైన్, డేటా సెంటర్లు, భారీ పెట్టుబడుల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. డేటా సెంటర్ల వల్ల కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఎకరాకు ఇచ్చే పరిహారం రైతుల భవిష్యత్తుకు సరిపోదని కవిత అన్నారు. రైతుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధి పేరుతో గ్రామీణ ప్రాంతాలను నష్టపరిచే ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేశారు. రైతుల పంట కొనుగోళ్ల విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని కవిత ఆరోపించారు. భవిష్యత్తులో పంట కొనుగోళ్లు ఎత్తివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## జ్యూవెలరీ దోపిడీపై సీఎం సీరియస్!

- నిందితుల ఆచూకీపై పోలీసులకు కీలక ఆదేశాలు
- 70 గంటలు గడిచినా దొరకని దొంగల జాడ
- ఓఎల్ఎక్స్ బైక్ నెంబర్ ప్లేట్లతో ముఠా మాయాజాలం
- బ్యాగుపై 'నందుర్బార్' క్లూతో మహారాష్ట్ర వైపు చూపు
- ధర్మపురి లాడ్జిలో ఆరుగురు సభ్యుల మూడు రోజుల బస
- సుభోధి గ్యాంగ్ పనేనా? • రాష్ట్ర సరిహద్దుల్లో గాలింపు
- 16 బృందాలు.. 100 మంది పోలీసుల ముమ్మర వేట
- బందోబస్తుపై వ్యాపారుల ఆందోళన





**హైదరాబాద్, మే 7:** కరీంనగర్‌లో పట్టపగలే గన్‌పాయింట్ వద్ద జరిగిన పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. అయితే ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. పట్టపగలు అంతటి దోపిడీ జరిగి, నిందితులు రాష్ట్ర సరిహద్దులు ఎలా దాటగలిగారని పోలీసు ఉన్నతాధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. తక్షణమే నిందితులను అరెస్ట్ చేసి, దోచుకెళ్లిన రెండు కోట్ల విలువైన సొత్తును రికవరీ చేయాలని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్లు పోలీసువర్గాల్లో చర్చ జరుగుతున్నది.

### అత్యంత చాకచక్యంగా నిందితుల ప్లాన్

పోలీసు విచారణలో నిందితులు అత్యంత పక్కా ప్లాన్‌తో దోపిడీకి పాల్పడినట్లు తేలింది. పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు వీరు 'ఓఎల్ఎక్స్' యాప్‌ను వాడుకున్నారు. ఒక వ్యక్తి అమ్మకానికి పెట్టిన బైక్ నెంబర్ ప్లేట్‌ను సేకరించి, దోపిడీకి వాడిన బైక్‌కు తగిలించినట్లు గుర్తించారు. ఘటనా స్థలంలో నిందితులు వదిలేసిన బ్యాగుపై "ఐ లవ్ నందుర్బార్" అని రాసి ఉండటంతో, ఈ ముఠాకు మహారాష్ట్రలోని నందుర్బార్ ప్రాంతంతో సంబంధం ఉండొచ్చని పోలీసులు గట్టిగా అనుమానిస్తున్నారు.

### ధర్మపురి లాడ్జిలో కుట్ర.. ఆరుగురు సభ్యుల ముఠా

దోపిడీలో పాల్గొన్నది ఐదుగురు కాదు, ఆరుగురు అని సాక్షుల ద్వారా స్పష్టమవుతోంది. వీరంతా ధర్మపురిలోని 'విజయలక్ష్మి' ప్రైవేటు లాడ్జిలో మూడు రోజుల పాటు బస చేసి రెక్కీ నిర్వహించినట్లు సమాచారం. మొదట నలుగురు, ఆ తర్వాత ఒకరు, సాయంత్రం మరొకరు చొప్పున విడతల వారీగా లాడ్జికి చేరుకున్నారు. ఈ దోపిడీ 'సుభోధి గ్యాంగ్' పనే అయి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నారు. దోపిడీ అనంతరం వీరు ధర్మపురి సమీపంలో పల్సర్ బైక్‌ను వదిలివేసి పారిపోయారు.

### పోలీసులకు సవాల్‌గా మారిన 'ట్రేసింగ్'

ప్రస్తుతం 16 ప్రత్యేక బృందాలకు చెందిన దాదాపు 100 మంది పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా రికార్డులను జల్లెడ పడుతున్నప్పటికీ, నిందితులు వదిలిన తప్పుడు క్లూల వల్ల దర్యాప్తుకు ఆటంకం కలుగుతోంది. నగరంలో సిసి కెమెరాలు, నిరంతర నిఘా ఉన్నప్పటికీ నాలుగు రోజులు గడిచినా నిందితుల జాడ లభించకపోవడం పోలీస్ శాఖకు తలనొప్పిగా మారింది. మరోవైపు, ఈ ఘటనతో కరీంనగర్ వ్యాపార వర్గాల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## పొన్నంకు నితిన్ గడ్కరీ ప్రశంసలు



**న్యూఢిల్లీ, మే 7:** తెలంగాణ రవాణా శాఖ పనితీరును కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కేంద్రమంత్రి అభినందనలు తెలిపారు. మంత్రి పొన్న ప్రభాకర్‌ని ప్రశంసిస్తూ నితిన్ గడ్గరీ గురువారం లేఖ రాశారు. చెక్‌పోస్టుల రద్దు నిర్ణయంపై ప్రశంసలు కురిపించారు. వాహన్ సమీకరణపై కేంద్రమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లను ప్రశంసించారు. రోడ్డు భద్రత చర్యల్లో తెలంగాణ ముందంజలో ఉందని కొనియాడారు. డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణపై ప్రశంసలు కురిపించారు. ప్రజా అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

# ఆధునిక సాగుతోనే రైతుకు మేలు

- డ్రోన్ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**నేరడిగొండ(బోథ్)(సిరి న్యూస్ ):** సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు స్వస్తి చెప్పి, మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల్లో భాగంగా గురువారం బోథ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యుత్ శాఖ రైతులకు అందిస్తున్న సేవలపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పెరుగుతున్న కూలీల కొరతను అధిగమించడానికి యంత్రీకరణే ఉత్తమ మార్గమని అన్నారు. ముఖ్యంగా డ్రోన్ టెక్నాలజీ ద్వారా పురుగు మందుల పిచికారీ చేయడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుందని వివరించారు. నిరుద్యోగ యువత గ్రూపులుగా ఏర్పడి పీఎంఈజీపీ పథకం కింద 35 నుంచి 40 శాతం ప్రభుత్వ రాయితీతో డ్రోన్లను కొనుగోలు చేసి ఉపాధి పొందవచ్చని అన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు తక్కువ ఖర్చుతో సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నేల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భూసారం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. మట్టి నమూనాలను పరీక్షించుకుని, సాయిల్ హెల్త్ కార్డుల ఆధారంగా మాత్రమే ఎరువులు వాడాలని సూచించారు. ప్రభుత్వం నిషేధించిన గ్లైఫోసెట్ వంటి మందులను ఉపయోగించవద్దన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వైపు రైతులు మొగ్గు చూపాలని, పశువుల పేడ, గోమూత్రం వంటి సహజ వనరులతో సాగు చేయడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందవచ్చని చెప్పారు. జిల్లాలో పంట మార్పిడి విధానంలో భాగంగా ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించుకోవడానికి రైతులు ఒక్క పంటపైనే ఆధారపడకుండా విభిన్న పంటలు సాగు చేయాలని పేర్కొన్నారు. విత్తనాలను లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేసి, రశీదులను భద్రపర్చుకోవాలని సూచించారు. జొన్న కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని, గిరిజన సహకార సంస్థలు, ఎఫ్‌పీఓల ద్వారా కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం నానో డీఏపీ వినియోగంతో మంచి దిగుబడులు సాధించిన రైతులను శాలువాతో సన్మానించారు. రైతు వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖ స్టాళ్లతో పాటు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన సోలార్ స్టాల్‌ను పరిశీలించారు. అనంతరం సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానాన్ని రైతులతో కలిసి ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, చీఫ్ ఇంజనీర్ చౌహాన్, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్, సర్పంచ్ అన్నపూర్ణ, ఉప సర్పంచ్ విజయలక్ష్మి, శాస్త్రవేత్త ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.





# నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు



**నేరడిగొండ(సిరి న్యూస్ ):** వానకాలం సాగు సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్ అధికారులు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని పలు విత్తన విక్రయ కేంద్రాల్లో టాస్క్ ఫోర్స్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, డీలర్ లైసెన్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని దుకాణ యజమానులకు సూచించారు. గడువు ముగిసిన విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా అనుమతి లేని పత్తి విత్తనాలు విక్రయిస్తే దుకాణాల లైసెన్సులను రద్దు చేయడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు ప్రభుత్వం గుర్తించిన అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, తక్కువ ధరకే వస్తున్నాయని నమ్మించి విక్రయించే నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విత్తన సంచులపై లాట్ నంబర్, గడువు తేదీని తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. ఎక్కడైనా అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ తనిఖీల్లో టాస్క్ ఫోర్స్ అధికారులు, తహశీల్దార్ ఎంఏ కలీమ్, ఆర్ఐ నాగోరావ్, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**తాండూర్(సిరి న్యూస్ ):** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తాండూర్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సుబ్బ దత్తు మూర్తి కోరారు. గురువారం తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో పండిన వరి ధాన్యాన్ని సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. రైతులు దళారుల మాటలు నమ్మి వడ్లను విక్రయించి మోసపోవద్దని సూచించారు. వరి కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గన్నీ సంచులు, రవాణా సదుపాయం, హమాలీలను అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే వడ్లకు సంబంధించిన చెల్లింపులు సకాలంలో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట గ్రామ సర్పంచ్ ముదాం వనజ, సహకార సంఘం జూనియర్ ఇన్స్పెక్టర్ సురేందర్, సీఈఓ అనిల్ కుమార్, ఆర్ఐ బొలిశెట్టి పద్మజ, డైరెక్టర్లు గట్టు మురళీధర్ రావు, మసాడి తిరుపతి, దేవరకొండ రాజన్న, ఎంఏ రవూఫ్, రాజేశం, పులగం తిరుపతి, నాయకులు బోనగిరి చంద్రశేఖర్, మాసాడి శ్రీరాములు, గోవర్ధన్, ఎస్ భూమయ్య, నారాయణ, సిబ్బంది వెంకటేశం, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రధాని బహిరంగ సభను జయప్రదం చేయండి



**సత్తుపల్లి(సిరి న్యూస్ ):** ప్రధాన మంత్రి బహిరంగ సభను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు పిలుపునిచ్చారు. సత్తుపల్లి పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో గురువారం పట్టణ అధ్యక్షుడు బాణావత్ విజయ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 10న సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. మూడోసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మోదీ తొలిసారిగా తెలంగాణకు వస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాదాపు రూ.8వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ భారీ సభకు రెండు లక్షల మందికి పైగా ప్రజలు హాజరుకానున్నారని చెప్పారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడం సంతోషకరమని, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో సాధించిన విజయం చారిత్రాత్మకమని అన్నారు. కేంద్ర నాయకత్వం తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించిందని, అందులో భాగంగానే ప్రధాని మోదీ రాష్ట్రానికి వస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కేంద్ర నాయకత్వం రాష్ట్ర నాయకత్వానికి మార్గదర్శనం చేయనున్నదని తెలిపారు. ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ మిశ్రా, మండల మాజీ అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శులు మంద శివయాదవ్, నాగమౌనిక, సాయి యాదవ్, సుబ్రమణ్యం, అశోక్, పెద్ది రాజు, ఎస్‌కే రహెమతుల్లా, మన్నేని నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## సంపాదకీయం

# భావోద్వేగాల సంకెళ్లలో యువత

నేటి ఆధునిక సమాజంలో సాంకేతికత, సోషల్ మీడియా యువతకు ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చిపెట్టాయి. అయితే, ఇదే సాంకేతికత వారి మానసిక ఆరోగ్యానికి ఒక పెద్ద శాపంగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో నిరాశ, ఆందోళన, ఒంటరితనం వంటి సమస్యలతో బాధపడుతున్న యువతీ యువకుల సంఖ్య రోజురోజుకూ ఆందోళనకరంగా పెరుగుతోంది. కేవలం భౌతిక ఆరోగ్యంపైనే కాకుండా, మానసిక ఆరోగ్యంపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరాన్ని ప్రస్తుత పరిస్థితులు నొక్కి చెబుతున్నాయి. వర్చువల్ ప్రపంచం – వాస్తవ ఒత్తిళ్లు యువత మానసిక స్థితి దెబ్బతినడానికి ప్రధాన కారణం సోషల్ మీడియా విపరీతమైన వినియోగం. ఇన్‌స్టాగ్రామ్, రీల్స్, ఎక్స్ (ట్విట్టర్) వంటి వేదికల్లో ఇతరుల కృత్రిమమైన, ఆడంబరమైన జీవితాలను చూసి తమను తాము తక్కువగా అంచనా వేసుకోవడం యువతలో ఎక్కువైంది. దీనికి తోడు సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ వేధింపులు వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. కేవలం డిజిటల్ ప్రపంచమే కాకుండా, చదువుల్లో మితిమీరిన పోటీ, ఉద్యోగ అవకాశాల కొరత, కెరీర్ భవిష్యత్తుపై ఉన్న అనిశ్చితి, కుటుంబాల నుంచి వచ్చే మితిమీరిన అంచనాలు యువతను తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నాయి.

**సమాజంపై పడుతున్న ప్రభావం**

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. దేశ ప్రగతికి చోదక శక్తులుగా నిలవాల్సిన యువత మానసికంగా కుంగిపోవడం దేశ భవిష్యత్తుకే ప్రమాదకరం. మానసిక ఒత్తిడి కారణంగా యువతలో వ్యసనాలకు బానిస అవ్వడం, ఆత్మహత్యల వంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవడం, నేర ప్రవృత్తి పెరగడం వంటి దుష్పరిణామాలు కనిపిస్తున్నాయి. మానసిక అనారోగ్యం అనేది కేవలం ఒక వ్యక్తిగత సమస్య కాదు. అది ఒక కుటుంబ వ్యవస్థను, తద్వారా దేశ ఉత్పాదకతను దెబ్బతీసే సామాజిక సంక్షోభం. ఈ విపత్కర పరిస్థితి నుండి యువతను రక్షించడానికి బహుముఖ వ్యూహం అవసరం. పాఠశాలలు, కళాశాలల్లో కేవలం మార్కులకే ప్రాధాన్యత ఇవ్వకుండా, మానసిక ఉల్లాసానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి విద్యాసంస్థలో అర్హత కలిగిన కౌన్సెలర్లను నియమించడం, ప్రతి విద్యార్థికి 'మెంటల్ హెల్త్ బ్రేక్స్' కల్పించడం తప్పనిసరి చేయాలి. తల్లిదండ్రులు పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపాలి. కేవలం వారి చదువులు, సంపాదనపైనే కాకుండా వారి భావోద్వేగాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. పిల్లలు స్వేచ్ఛగా తమ సమస్యలను పంచుకునే వాతావరణం ఇంట్లో ఉండాలి. యువత స్వచ్ఛందంగా స్క్రీన్ టైమ్‌ను తగ్గించుకోవాలి. వర్చువల్ స్నేహాల కంటే నిజ జీవితంలో స్నేహితులతో గడపడం, శారీరక వ్యాయామం, యోగా, క్రీడలపై దృష్టి పెట్టడం ద్వారా మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చు. మానసిక ఆరోగ్య సేవలను సులభంగా, ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలి. 24/7 అందుబాటులో ఉండే హెల్ప్‌లైన్ నంబర్లపై విస్తృత అవగాహన కల్పించాలి. మానసిక సమస్యలను సామాజిక కళంకంగా చూసే ధోరణిని మార్చడానికి ప్రభుత్వాలు ప్రచారాలు చేపట్టాలి. యువత మన దేశానికి అమూల్యమైన సంపద. వారి మెదళ్లకు పదును పెట్టడంతో పాటు, వారి హృదయాలకు, మనస్సులకు ప్రశాంతతను చేకూర్చడం మనందరి బాధ్యత. మానసిక ఆరోగ్యంపై మాట్లాడటం బలహీనత కాదు, అదొక అవసరమనే చైతన్యాన్ని సమాజంలో తీసుకురావాలి. అప్పుడే ఆరోగ్యకరమైన, దృఢమైన యువ భారతాన్ని మనం ఆవిష్కరించగలం.

# రైతుల రవాణా సమస్యలను పరిష్కరించాలి

**గంభీరావుపేట(సిరి న్యూస్ ):** గంభీరావుపేటలో రైతులకు రవాణా విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని శ్రీ సాయిరామ అసోసియేషన్ సభ్యులు కోరారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని లారీ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపి, రైతులకు అనుకూలంగా ట్రాక్టర్లు నడపడానికి అనుమతి ఇవ్వాలని స్థానిక తహశీల్దార్ మారుతి రెడ్డి, లారీ అసోసియేషన్ అధ్యక్షులను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్ మారుతి రెడ్డి, లారీ అసోసియేషన్ అధ్యక్షులు ట్రాక్టర్లు నడపడానికి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. దీంతో రైతులకు రవాణా పరంగా ఊరట కలిగింది. రైతుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించినందుకు అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిరామ అసోసియేషన్ అధ్యక్షులు గంట శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గొల్లపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శి మరవిని మహేష్, గౌరవ అధ్యక్షులు పెద్దవిని రాజమల్లయ్య, ఇరవైని సత్యం, గంట రమేష్, ఎగదండి మహేష్, టేక్ మల్లరాజు తదితరులు పాల్గొన్నారు.



# లాభదాయకమైన పంటలతోనే మేలు

- డిమాండ్ ఉన్న పంటలపై రైతులు దృష్టి పెట్టాలి
- 90 శాతం సబ్సిడీతో ఆయిల్ పామ్ సాగుకు అవకాశం
- పీఎం కుసుమ్ సోలార్ ప్లాంట్లతో నిరంతర అదనపు ఆదాయం
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, సిరి న్యూస్:**



ప్రస్తుత మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులు కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న లాభదాయకమైన పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోతిరెడ్డిపల్లి రైతు వేదికలో నిర్వహించిన రైతు వారోత్సవాల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు తమ భూములకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకుని సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు మెరుగైన లాభాలు పొందవచ్చని, ఆధునిక పద్ధతులు మరియు కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ముఖ్యంగా పీఎం కుసుమ్ కాంపోనెంట్ పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని నిరంతర ఆదాయం పొందేలా ముందుకు రావాలని, అలాగే 90 శాతం సబ్సిడీ ఉన్న ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. సదస్సులో రైతులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, జహీరాబాద్, సదాశివపేట, వట్‌పల్లి ప్రాంతాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న డ్రోన్లు, కట్టర్లు, స్ప్రేయర్లు వంటి వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల వినియోగంపై అధికారులు ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు.

# ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల సేకరణ చేపట్టాలి
- రాజకీయ పార్టీలు, అసోసియేషన్ల సహకారం తీసుకోవాలి
- అర్హులైన ప్రతి ఓటరు వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలి
- అడిషనల్ సీఈఓ వాసం వెంకటేశ్వర్ రెడ్డి

**సంగారెడ్డి, సిరి న్యూస్:**



భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా, వేగవంతంగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2025 ఓటరు జాబితాలోని అర్హులైన ప్రతి ఓటరును 2002 జాబితాతో అనుసంధానం చేసే ప్రక్రియను ఖచ్చితంగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మ్యాపింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో మ్యాపింగ్ ప్రక్రియ ఆశించిన స్థాయిలో లేదని పేర్కొంటూ, ఏఈఆర్వోలు రోజువారీ లక్ష్యాలతో పని చేయాలని వెంకటేశ్వర్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఈఆర్వో రాజేందర్, ఏఈఆర్వోలు, బీఎల్‌వో సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు కలగొద్దు

- కేంద్రాల్లో వెంటనే ట్రక్ షీట్లు జనరేట్ చేయాలి
- చెల్లింపులు వేగవంతం చేయాలి
- గన్నీ బ్యాగులు, తార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, సిరి న్యూస్:**



సంగారెడ్డి జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పౌరసరఫరాలు, సహకార శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే ట్రక్ షీట్లు జనరేట్ అయ్యేలా చూడాలని, ట్యాబ్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతులకు నిర్ణీత గడువులోగా డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దింపుకోవాలని, ధాన్యం స్వీకరించిన వెంటనే వారి నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం కొలిచే యంత్రాలు, సరిపడా గన్నీ బ్యాగులు, తార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరిగినా సహించేది లేదని, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు వెసులుబాటు కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంగీతతో పాటు పౌరసరఫరాలు, మార్క్‌ఫెడ్, డీఆర్డీఓ మరియు సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మతసామరస్యంతో బక్రీద్ నిర్వహించాలి

- ఖురేషి కులస్తులు, హిందూ సంఘాలతో సమావేశం
- పశువుల అక్రమ రవాణాపై జీరో టాలరెన్స్
- మెదక్ జిల్లా ఎస్పీ.డి.వి శ్రీనివాస రావు

**మెదక్ మే,07(సిరిన్యూస్)**




మెదక్ జిల్లాలో బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో, మతసామరస్యాన్ని కాపాడేలా నిర్వహించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు.పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఖురేషి కులస్తులు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్, హిందూ వాహిని, శ్రీరామ్ సేన, హిందూ యువవాహిని సభ్యులతో వేర్వేరుగా అవగాహన సమావేశాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సరైన అధికారిక అనుమతులు, పత్రాలు ఉన్న పశువులను మాత్రమే సంహరించాలని ఖురేషి కులస్తులకు సూచించారు. ఆవులను ఎట్టి పరిస్థితుల్లోనూ సంహరించవద్దని స్పష్టం చేశారు.పశువుల కొనుగోలు సమయంలో సంబంధిత పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మాంసం నిల్వ చేసే ప్రదేశాల్లో పరిశుభ్రత పాటించాలని, పక్షులు, కుక్కలు, కోతుల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆవులు, దూడల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, వ్యక్తులపై దాడులకు పాల్పడడం నేరమని హెచ్చరించారు. అక్రమంగా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నామని చెప్పారు. పశువుల అక్రమ రవాణా శిక్షార్హమైన నేరమని, మూగజీవాలపై క్రూరత్వానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పశువుల రవాణా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్, కౌ స్లాటర్ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత చట్టాల కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గోరక్షణ పేరుతో దాడులు, వాహనాల ధ్వంసం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలు నిర్ధారించకుండా వాటిని షేర్ చేయవద్దని ప్రజలకు సూచించారు. పశువుల అక్రమ రవాణాపై సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, సీఐ లు జర్జ్, సందీప్ రెడ్డి, వెటర్నరీ డాక్టర్ లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది, మత పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.



# జననేత రాక...భక్తితో పులకించనున్న కొర్లకుంట

## చిత్తారమ్మ గుడి విగ్రహ ప్రతిష్ట

## పాల్గొనున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**జిన్నారం మే 7 సిరి న్యూస్**



జిన్నారం పురపాలిక పరిధిలోని కొర్లకుంట గ్రామంలో వెలసిన శ్రీ చిత్తారమ్మ అమ్మవారి గుడి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఈనెల 8వ తేదీన అత్యంత వైభవంగా జరగనుంది. శుభకార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ పుణ్యవచనం విగ్రహ ప్రతిష్టాపన మరియు హోమ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు ఎమ్మెల్యే కు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో వెంకటేశం గౌడ్, మున్సిపల్ చైర్మన్ జనార్దన్ ముదిరాజ్, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజేష్ తదితరులు పాల్గొంటున్నారు అని తెలిపారు.

# కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం చేసిన - కాంగ్రెస్ శ్రేణులు



**వెల్దుర్తి, మే 07,(సిరి న్యూస్ )**

వెల్దుర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టి బొమ్మను గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ ఉన్నత పదవిలో ఉన్న ముఖ్యమంత్రిని మీ ఇష్టానుసారంగా మాట్లాడిన విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారని మీ అహంకారపూరితమైన మాటలవల్లే ప్రజల మిమ్మల్ని చీదరించుకుంటున్నారని, కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టించేలా పిచ్చి పిచ్చి వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. అంతే కాకుండా గత పది సంవత్సరాలలో రాష్ట్రాన్ని అప్పులు పాలు చేయడం కాకుండా మీరు చెప్పే అబద్ధపు మాటలు రాష్ట్ర ప్రజలు వినరని ఈరోజు తెలంగాణ రాష్ట్రం ప్రజాపాలనలో రెండున్నర సంవత్సరాల్లో అభివృద్ధి పథంలో నడుస్తుందని ఇందిరమ్మ ఇండ్లు ఉద్యోగాల కల్పనలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి ముందుకు తీసుకెళ్తున్నారని ఆయన అన్నారు.“ కేటీఆర్ నువ్వు ఏ రకంగా మాట్లాడితే మేము కూడా అదే రకంగా సమాధానం చెప్తాం” అని ఆవుల రాజిరెడ్డి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# హల్దీ వాగులో స్నానానికి వెళ్లి ముగ్గురు యువకులు మృతి

## మరణంలో కూడా వీడని స్నేహం

## శోకసంద్రంలో మూడు కుటుంబాలు

## నర్సాపూర్ పట్టణలో విషాదఛాయలు





**నర్సాపూర్ మే 07, (సిరి న్యూస్)**



నర్సాపూర్ పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు నాచారం సమీపంలో హల్దీ వాగులో స్నానానికి వెళ్లి నీటిలో మునిగి మృతి చెందారు ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది కుటుంబీకుల సమాచారం ప్రకారం మెదక్ జిల్లా నర్సాపూర్ కు చెందిన ఎర్రగొల్ల ప్రశాంత్ (27), వికాస్ (27), కొంతమి ఆనంద్ రెడ్డి (27)లు బుధవారం తూప్రాన్ లో జరిగిన ఒక వివాహ వేడుకకు వెళ్లారు.తిరుగు ప్రయాణంలోఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం నాచారం సమీపంలో హల్దీ వాగులో సరదాగా నీటిలో స్నానం చేద్దామని వెళ్లిన ముగ్గురు యువకులు దిగగా, నీటి లోతును అంచనా వేయలేక ప్రవాహంలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు స్థానికుల సమాచారంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టి, ముగ్గురు యువకుల మృతదేహాలను వెలికి తీశారు పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. నర్సాపూర్ పట్టణానికి చెందిన ముగ్గురు స్నేహితులు ఒకేసారి మృతి చెందడంతో వారి కుటుంబాలలో నర్సాపూర్ లో విషాదఛాయలు అలుముకున్నాయి

# జూదం ఆడుతున్న ఇద్దరు అరెస్ట్

## అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు

## మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్



**పాపన్నపేట మే 7 (సిరి న్యూస్):**

మండలం అన్నారం గ్రామ శివారులోని ప్రకృతి వనం వెనుక పేకాట ఆడుతున్న వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్టైన వారిలో దర్శనం రాజు (32), దర్శనం వినోద్‌కుమార్ (29)లు ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,500 నగదు, రెండు సెల్‌ఫోన్లు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జిల్లాలో జూదం, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సమన్వయంతో నిరంతరం దాడులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ పరిసరాల్లో జరిగే అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది



**సంగారెడ్డి జిల్లా,మే 7( సిరి న్యూస్)**

మాచెపల్లి గ్రామం, కొండాపూర్ మండలం, సంగారెడ్డి జిల్లాలో లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రాజేశ్వర్ నాయక్ , సుష్మ మరియు సర్పంచ్ లక్ష్మి కిషన్ నాయక్ వ్యవసాయ వ్యవసాయ విస్తరణ అధికారి రవి, పంచాయతీ సెక్రటరీ హంసలేఖ రైతులు పాల్గొన్నారు.శాస్త్రవేత్తలు రైతులను, పంటల్లో యూరియా, ఎరువులు,పురుగుమందులను పరిమిత పరిమాణంలో ఉపయోగించడం ద్వారా సాగుఖర్చులు తగ్గించి, మట్టికి ఆరోగ్యం చేకూరుస్తుందని తెలియజేశారు.అధిక దిగుబడి కొరకు పంట మార్పిడి అనుసరించాలని, అన్నీ సీజన్లలో ఒకే పంట వేయడం మానుకోవాలని సూచించారు. పచ్చి ఎరువు పంటల సాగు ప్రోత్సహించాలనీ వివరించారు.రైతులు పచ్చి ఎరువు పంటల విత్తనాల లభ్యత, ట్రాన్స్‌ప్లాంటింగ్ యంత్రాలకు సంబంధించిన సబ్సిడీలపై ప్రశ్నలు అడిగారు. శాస్త్రవేత్తలు ప్రో. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన కొత్త రకాల విత్తనాలపై వివరాలు అందించారు. నీటి వృథా తగ్గించేందుకు డ్రిప్ ఎరిగేషన్, స్ప్రింక్లర్ విధానాలను పాటించాలని, పర్యావరణ రక్షణకు వృక్షాలను పెంచాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం రైతులలో సరికొత్త పరిజ్ఞానం, సాంకేతికతలపై అవగాహన పెంచి మంచి ఫలితాలు అందించనుందని ఆశిస్తున్నాము.

# వ్యవసాయంలో టెక్నాలజీ ఉపయోగించుకోవాలి

## జిల్లా అదనపు కలెక్టర్ నగేష్




**కొల్చారం మే 7( సిరి న్యూస్)**

వ్యవసాయంలో నూతన టెక్నాలజీని అంది పుచ్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ రైతులకు సూచించారు.గురువారం కొల్చారం మండలం పోతన శెట్టిపల్లిలో జరిగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతు వరము సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. మన దేశం వ్యవసాయ ఆధారిత దేశమని , రైతులు వ్యవసాయంలో నూతన టెక్నాలజీని అంది పుచ్చుకోవాలని పిలునిచ్చారు. నూతన వంగడాలు, పనిముట్లు,యంత్రాలను ఉపయోగించి పంటల ఉత్పత్తి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, స్థానిక తహసిల్దార్,అధి కారులు పాల్గొన్నారు.

# అక్రమంగా భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి

**కొల్చారం మే 7 (సిరి న్యూస్)**



మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలో ఓ విలేఖరి అక్రమంగా మూడు గుంటల భూమిని కబ్జా చేసి సాగు చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకో వాలని స్థానిక తహసీల్దార్ కు మెమొరాండం సమర్పించారు వివరా లలోకి వెళ్తే గ్రామానికి చెందిన కన్నోజి సుశీల736/1/14 గల భూమిలో ఎన్నో సంవత్సరాల నుండి సాగు చేస్తూ జీవన ఉపాధ కొనసాగిస్తున్నారు ఈమధ్య ఇదే గ్రామానికి చెందిన ఓ ప్రముఖ విలేఖరి మెయిన్ రోడ్డుకు దగ్గర ఉండడంతో మూడు గుంటల భూమిని సబ్జా చేసుకొని వరి పంట వేసుకున్నట్లు మిగతా 35 గుంటలు కూడా చేసుకుంటా ఎవరికీ చెప్తారు చెప్పుకోండి అంటూ అనడంతో స్థానిక తాసిల్దార్ కు మెమొరండం సమర్పించారు చట్టరీత్యా వారిపై చర్యలు తీసు కోవాలని ఈ సందర్భంగా వారు అన్నారు

# నా నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటా





- గెలుపోటములు సహజమే
- రాజన్న ఫౌండేషన్ ద్వారా సేవ చేయడమే నా లక్ష్యం
- ఇప్పటివరకు 12 వేల న్యూట్రిషన్ కిట్లు అందజేసిన రాజన్న స్వచ్ఛంద సంస్థ
- వెల్దుర్తిలో మాతృదేవోభవ కార్యక్రమంలో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, మే 07,( సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలం లోని అన్ని గ్రామాలలో గల గర్భిణీ స్త్రీలకు 170 మాతృదేవోభవ న్యూట్రిషన్ కిట్లను గురువారం వెల్దుర్తి లో గల బాలాజీ ఫంక్షన్ హాల్ యందు నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్, రాజన్న ఫౌండేషన్ చైర్మన్ ఆవుల రాజిరెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యమని, గర్భధారణ సమయంలో, సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి ఆరోగ్యాన్ని కాపాడడం మన అందరి బాధ్యత అని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు రాజన్న స్వచ్ఛందా సంస్థ ద్వారా నిరుద్యో గులకు ఉద్యోగ కల్పన అలాగే మాతృదే వోభవ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు నియోజకవర్గంలో 12,000 మంది గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయడం ఇలాంటి సేవా కార్యక్రమం లో మనందరం పాల్గొనడం కూడా మన అదృష్టమని ఇంత మంచి సేవ దృక్పథం ఉన్న నాయకుని నీడలో తోడుగా ఉండడం కూడా మనకు దేవుడిచ్చిన వరమని ఇంతే కాకుండా అతి త్వరలో ఇంకో మంచి కార్యక్రమం ద్వారా మన ముందుకు రాజన్న సేవా సంస్థ వస్తుందని,ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని, అవసరమైన వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గర్భిణీ స్త్రీలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేష్ రెడ్డీ, జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, నాయకులు తలారి మల్లేష్, నంబూద్రి గుప్తా, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, మాజీ ప్రజ ప్రతినిధులు, సినియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



# కొట్టిన చెట్లకు కేసు మాఫీకి 10 లక్షల డిమాండ్

- అడ్వాన్సుగా రూ 3. 5లక్షలు లంచం తీసుకుంటు ఏసీబీ కి చిక్కిన భద్రాచలం ఎఫ్ డి ఓ, డి ఆర్ ఓ

**భద్రాద్రి కొత్తగూడెం సిరి న్యూస్, మే 7:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో బీటీ రోడ్డు నిర్మాణ పనులు మూలంగా కొన్ని చెట్లు తొలగించడం తో వాటి గురించి కేసు నమోదు చేయకుండా ఉండేందుకు భద్రాచలం అటవీ శాఖ ఎఫ్ డి ఓ సుజాత రూ పది లక్షలు డిమాండ్ చేసారు. అటవీ చట్టం అసలే కఠినం కానీ ఆమె చేసిన లంచం కూడా అధికం అనుకోని సదరు కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు ఒప్పందం ప్రకారం గురువారం రూ 3.5 లక్షలు లంచం తీసుకుంటు ఉండగా ఏసీబీ డి ఎస్పీ వై రమేష్ ఆధ్వర్యంలో ఆమెను, చర్ల ఇంచార్జ్ డి ఆర్ ఓ కృష్ణయ్య ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతం లో రోడ్డు వేస్తుండగా పొరపాటున చెట్లు దెబ్బ తిన్నాయి ఈ విషయంలో ఎఫ్ డి ఓ సుజాత పది లక్షలు డిమాండ్ చేసి భద్రాచలం కార్యాలయం లో 3.5 లక్షలు లంచం తీసుకుంటు డి ఆర్ ఓ తో పాటు వలపన్ని పట్టుకున్నట్టు ఏసీబీ డిఎస్ వై రమేష్ తెలిపారు. గతం లో కూడా కొత్తగూడెం అటవీ అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి మూడున్నర లక్షలు లంచం తీసుకుంటు పట్టుబడ్డారు.

# ఎరువుల వాడకంలో సమతుల్యత పాటించాలి

- ప్రతి ఏటా జిల్లాలో రూ. 49 కోట్ల సబ్సిడీ ఎరువులు
- 1001 రకం వరి విత్తనాలు పండించకూడదు
- వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శివ ప్రసాద్

**జోగిపేట, మే 07, (సిరి న్యూస్)::**

జిల్లాలో రైతులు ఎరువుల వాడకంలో సమతుల్యత పాటించడం లేదని, దీంతో భూములు సారవంతాన్ని తగ్గి పోతున్నాయని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శివప్రసాద్ అన్నారు.గురువారం స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో నిర్వహించిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తుందని, రైతులు సన్నాలను అధికంగా పండించి బోనస్ రూ. 500 పొందాలన్నారు.1010 రకం వరి విత్తనాలు వేయాలని, 1001 వేయకూడదని, వీటిని మిల్లర్లు కూడా కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 49 కోట్ల రూపాయలు సబ్సిడీ ద్వారా ఎరువులను అందిస్తుందని ఎక్కువ మోతాదులో ఎరువుల వాడకం వలన దిగు బదులు తగ్గుతున్నాయి అన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాలతో రైతులు ఆర్థిక అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. సాగు ఖర్చులు తగ్గించు కోవాలని, డ్రోన్ వ్యవస్థ ను రైతులు అలవర్చుకోవాలని ఆయన సూచించారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహించడం జరుగుతుందని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. జగన్మోహన్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, ఏడీఏ రమాదేవి, కరెంటు డిఈ శ్రీనివాసులు, సైంటిస్టు అరుణ, ఉద్యానవన అధికారి సమత, ఏవోలు శ్రీహరి, చైతన్య, ప్రవీణ, ఏఈఓ లు శ్రీనివాస్, రాజేష్ గౌడ్, యశస్విని, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పిల్లల సంరక్షణలో శ్రద్ధ వహించాలి

- బాధితులకు అండగా నిలవాలి
- అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తాం
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య
- శిశు గృహాలు, సఖి కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

**సంగారెడ్డి, సిరి న్యూస్:**

జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర మార్గదర్శకత్వంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య గురువారం పట్టణంలోని శిశు గృహా, జువైనల్ జస్టిస్ బోర్డ్, సఖీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని సౌకర్యాలను, నిర్వహిస్తున్న రికార్డులను ఆమె నిశితంగా పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. శిశు గృహాలోని పిల్లల పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి సంరక్షణతో పాటు క్రమశిక్షణ, విద్యపై దృష్టి పెట్టాలని సూచించారు. పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లల బాగోగులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సఖి కేంద్రానికి వచ్చే బాధితుల సమస్యలను సావధానంగా విని, వారికి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికా రులకు తెలిపారు. జువైనల్ జస్టిస్ బోర్డులో బాలల హక్కుల రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. ఎవరికైనా న్యాయ పరమైన సమస్యలు ఉంటే సంగారెడ్డిలోని న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని, అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత కేంద్రాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మహిళల ఆరోగ్య రక్షణకు ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరం

## మే 8న గుమ్మడిదల పీహెచ్‌సీలో నిర్వహణ

## వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్

**గుమ్మడిదల, మే 7(సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని మహిళలు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్ కోరారు. ప్రస్తుతం సమాజంలో క్యాన్సర్ వ్యాధి తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ముఖ్యంగా మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు నిర్ధారణ ఎంతో కీలకమని తెలిపారు. మహిళల్లో క్యాన్సర్ కారక కణాలను తొలి దశలోనే గుర్తించి, ప్రాణాంతక వ్యాధి నుంచి రక్షించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్షలు మరియు అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే 8 న గుమ్మడిదల పీహెచ్‌సీ ఆసుపత్రిలో ఏఐజి హాస్పిటల్, గెన్యువల్ ఇండియా లిమిటెడ్, సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరంలో పరిమితంగా 60 మంది మహిళలకు మాత్రమే పరీక్షలు నిర్వహించనున్నందున, ఆసక్తి గల మహిళలు ముందుగా వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళలు ఆరోగ్యంపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా, అపోహలకు తావివ్వకుండా ముందస్తు పరీక్షల ద్వారా తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని పేర్కొన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నియంత్రించే అవకాశం ఉందని, ఆరోగ్యవంతమైన జీవితం గడపడానికి ఈ పరీక్షలు ఎంతో దోహదపడతాయని డాక్టర్ మధుకర్ తెలిపారు. శిబిరానికి మహిళలు హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది

- గుమ్మడిదలలో రూ.26 లక్షల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**గుమ్మడిదల, మే 7 (సిరి న్యూస్):**

పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లు ఆర్థిక భారంగా మారకుండా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మైపాల్ రెడ్డి పేర్కొన్నారు. గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలు, వార్డులకు చెందిన 26 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన రూ.26 లక్షల విలువైన చెక్కులను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మాజీ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వేలాది పేద కుటుంబాలకు భరోసాగా నిలిచాయని తెలిపారు. ఆడపిల్ల పెళ్లి కోసం అప్పుల పాలవుతున్న కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, తహసీల్దార్ పరమేశం, ఎంపీడీవో ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, కౌన్సిలర్లు ఆకుల మాధవి, పద్మ, ప్రమీల, మూడుచింతల నరేందర్ రెడ్డి, మురళి, కిషన్, సంజీవరెడ్డి, రాజిరెడ్డి, రమేష్ కోఆప్షన్ సభ్యులు సద్ది విజయ భాస్కర్ రెడ్డి, సర్పంచులు మహిపాల్ రెడ్డి, పెంటారెడ్డి, సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ల రవాణా సమస్యకు పరిష్కారం



**గంభీరావుపేట(సిరి న్యూస్ ):** గంభీరావుపేట మండలంలో ట్రాక్టర్ల రవాణా సమస్యను పరిష్కరించేందుకు మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం పంతులు కృషి చేశారు. ఈ సమస్యపై ఆయన సివిల్ సప్లై కమిషనర్, హైదరాబాద్ అధికారులతో చర్చించి ట్రాక్టర్లు యథావిధిగా నడిచేలా చర్యలు చేపట్టారు. దీంతో ట్రాక్టర్ రవాణా సమస్యకు పరిష్కారం లభించింది. ఈ సందర్భంగా శ్రీరామ ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం పంతులకు కృతజ్ఞతలు తెలుపుతూ ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు గంట శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గొల్లపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శి గంట రమేష్, చిట్టెంపల్లి రాజు, గౌరవాధ్యక్షులు పెద్దవిని రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైశాఖ బహుళ పంచమి శ్రీ గురు పీఠంలో ప్రత్యేక పూజలు!

- వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ .!!

**శివంపేట మే 7 ( సిరి న్యూస్ )**



శివంపేట మండల కేంద్రంలోని గూడూరులోని శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం గురుపరంపర పంచవటి సహిత శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో ప్రధాన అర్చకులు శ్రీ శాస్తుల నటరాజ్ శర్మ మరియు శ్రీ శాస్తుల శ్రీ హర్ష ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటల 30 నిమిషాలకు శ్రీ షిరిడి సాయిబాబా కాకడ ఆరతి ఇవ్వడం జరిగినది. తదుపరి శ్రీ శాసుల నటరాజ్ శర్మ చే బాబా అభిషేకము అలంకరణ మరియు బాబా గారి ఉత్సవ మూర్తికి అభిషేకం శతనామార్చన నివేదన అనంతరం ఆరతి సమర్పించడం అయినది. శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం లో శ్రీ శాస్తుల శ్రీ హర్ష చే మూలమూర్తుల అభిషేకము అలంకరణ అర్చన ఆరతి సమర్పించడమైనది. తదుపరి శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం ఉత్సవమూర్తులకు మహన్యాస పూర్వక అభిషేకం తదుపరి శతనామార్చన నివేదన తో ఆరతి సమర్పించడం అయినది. శ్రీ పంచవటిలోని దత్తాత్రేయ స్వామి, శ్రీ ధన్వంతరి, శ్రీ మహాలక్ష్మి శ్రీ దుర్గా మాత, శ్రీకృష్ణ పరమాత్మ, వటపత్ర సాయి, శ్రీమహావిష్ణువు దివ్యమూర్తులకు అభిషేక అర్చన నివేదనతో ఆరతి సమర్పించడమైనది. మధ్యాహ్నం శ్రీ షిరిడి సాయిబాబా మధ్యాహ్న ఆరతి లో అశేష భక్తులు పాల్గొని బాబా రతిని ఆలపించారు . భక్తులందరూ కొద్ది సమయం సత్సంగంలో పాల్గొని శ్రీ సాయినాధుని ఆశీస్సులు తీర్థ ప్రసాదములు స్వీకరించడం అయినది. తదనంతరం శ్రీ గురు పీఠంలో నిరంతరంగా ప్రతి గురువారం జరిగే అన్న ప్రసాద వివరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి శ్రీ గురు పీఠం ట్రస్ట్ సభ్యులు శ్రీ జిన్నారం పెద్దగౌని సూర్య కుమార్ గౌడ్, ఉమారాణి, స్వరాజ్యలక్ష్మి, గూడూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ బేగరి నర్సయ్య కొండల్,కుమ్మరి శ్రీకాంత్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొనడం జరిగింది. భక్తులందరికీ శ్రీ గురు పీఠం ట్రస్ట్ చైర్మన్ శ్రీ శివ కుమార్ గౌడ్ రమాదేవి దంపతులు అభినందనలు తెలిపారు.

# ప్రజలకు సౌకర్యవంతమైన పరిపాలన అందించడమే లక్ష్యం

- అభివృద్ధి పనుల్లో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలి
- పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయం అదనపు అంతస్తులు, పశువుల ఆసుపత్రి అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన..

**గుమ్మడిదల, మే 7( సిరి న్యూస్):**



ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలన్న లక్ష్యంతో గుమ్మడిదల మున్సిపాలిటీలో అదనపు గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో హెట్రో పరిశ్రమ సౌజన్యంతో 80 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న అదనపు అంతస్తులు, పశువుల ఆసుపత్రిలో న్యూ ల్యాండ్ పరిశ్రమ సహకారంతో 33 లక్షల రూపాయలు నిర్మించి తలపెట్టిన అదనపు గదుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలన్న లక్ష్యంతో గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయం అదనపు అంతస్తుల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన పరిశ్రమల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, తహసిల్దార్ పరమేశం, ఎంపీడీవో ఉమాదేవి, కౌన్సిలర్లు ఆకుల మాధవి, పద్మ, ప్రమీల, మూడుచింతల నరేందర్ రెడ్డి, మురళి, కిషన్, సంజీవరెడ్డి, రాజిరెడ్డి, రమేష్ కోఆప్షన్ సభ్యులు సద్ది విజయ భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణకు 'భరోసా'

- 10 ఏళ్లుగా పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు అండగా
- నిందితులకు శిక్ష పడినప్పుడే నేరాలు తగ్గుతాయి
- బాధితులకు రూ. 1.83 కోట్ల పరిహారం అందజేత
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి, సిరి న్యూస్:**




సంగారెడ్డి జిల్లా భరోసా కేంద్రం 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 2016 మే 7న ప్రారంభమైన భరోసా కేంద్రాలు, పోక్సో మరియు అత్యాచార కేసుల్లో బాధితులకు ఫిర్యాదు నమోదు నుండి కోర్టు తీర్పు వరకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. మెడికల్, లీగల్, కౌన్సిలింగ్, పరిహారం వంటి అన్ని సేవలను ఒకే వేదికపై అందిస్తూ తెలంగాణ భరోసా సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు, బాలికలపై అన్యాయం జరిగితే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, భరోసా సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 688 పోక్సో కేసులు, 85 అత్యాచార కేసులు సహా మొత్తం 935 కేసుల్లో బాధితులకు సేవలు అందించినట్లు వెల్లడించారు. సుమారు 468 మంది బాధితులకు రూ. 1,83,42,500 పరిహారం అందజేయడం జరిగిందని వివరించారు. నేరాలను నియంత్రించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో డీఎస్పీ సత్యయ్య గౌడ్, ఇన్ స్పెక్టర్ రాము నాయుడు, భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మి మరియు సిబ్బంది పాల్గొన్నారు.


# సొంతింటి కలలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ పథకం

- ఇందిరమ్మ ఆశయాలను నేటి ప్రభుత్వం నిజం చేస్తోంది
- ఆత్మ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి

**గుమ్మడిదల, మే 7 (సిరి న్యూస్):**



పేద ప్రజలు గౌరవప్రదమైన జీవితం గడపాలంటే ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం ఎంతో ఉపయోగకరమైందని పఠాన్‌చెరు ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం గుమ్మడిదల మండల పరిధిలోని రాంరెడ్డిబాయి గ్రామపంచాయతీలో కొంతం ఇందిరమ్మ మోహన్ రెడ్డికి మంజూరైన ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇంటిని గ్రామ సర్పంచ్ సామల మహిపాల్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించడం ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా అనేక కుటుంబాలు సొంతింటి కోసం ఎదురుచూస్తున్నాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ గృహ పథకాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. సొంతిల్లు అనేది కేవలం నివాస స్థలం మాత్రమే కాదని, అది కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుకు నమ్మకం కల్పించే ఆధారమని పేర్కొన్నారు. ప్రభుత్వం పారదర్శక విధానంలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తోందని, ఎంపికైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలలను నెరవేర్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో పేదలకు గృహ నిర్మాణాలు జరిగితే జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు గ్రామాభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన వారికి త్వరితగతిన గృహాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కానుకుంట సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉపాధ్యక్షుడు సామల దయాకర్ రెడ్డి, పఠాన్ చెరువు వ్యవసాయ కమిటీ సభ్యుడు పడమటి మహిపాల్ రెడ్డి, ఉపసర్పంచులు ఎం.బి. పాషా, జయేందర్ రెడ్డి, వార్డు సభ్యుడు కిష్టా గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సామల గోపాల్ రెడ్డి, గుమ్మడిదల మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మౌనిక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# 'మా ఇంటి బంగారం' విడుదల వాయిదా

హైదరాబాద్, మే 7 : ప్రముఖ నటి సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'మా ఇంటి బంగారం' సినిమా విడుదల వాయిదా పడినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. చాలా కాలం తర్వాత సమంత పూర్తి స్థాయి శక్తివంతమైన పాత్రలో కనిపించనున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన ప్రచార దృశ్యాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. దర్శకురాలు నందిని రెడ్డి ఈ చిత్రాన్ని కుటుంబ భావోద్వేగాలు, ఉత్కంఠభరితమైన పోరాట సన్నివేశాల మేళవింపుతో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను సమంత తన సొంత నిర్మాణ సంస్థపై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సాధారణ గృహిణిలా కనిపించే మహిళ అవసరమైన సమయంలో ధైర్యంగా ఎదురుదాడి చేసే పాత్రలో సమంత కనిపించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రచార దృశ్యాల్లో చూపించిన పోరాట సన్నివేశాలు అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. మొదట ఈ చిత్రాన్ని మే 15న విడుదల చేయాలని చిత్రబృందం భావించింది. అయితే ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐపీఎల్ 2026 సందడి కొనసాగుతుండటంతో సినిమా ప్రదర్శనలపై ప్రభావం పడే అవకాశం ఉందని నిర్మాతలు అంచనా వేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిత్ర విడుదలను జూన్ 19కు మార్చినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది. భావోద్వేగాలు, కుటుంబ కథనం, ఉత్కంఠభరిత సన్నివేశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాతో సమంత మరోసారి తన నటనలో కొత్త కోణాన్ని చూపించబోతున్నారని అభిమానులు భావిస్తున్నారు. విడుదల వాయిదా పడటం కొంత నిరాశ కలిగించినప్పటికీ, సరైన సమయంలో విడుదలైతే సినిమాకు మరింత మంచి ఆదరణ లభించే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆ పాత్రకు నేను సెట్ కాలేదు..

## సాయి పల్లవి ఆసక్తికర వ్యాఖ్యలు

**ముంబై, మే 7 :** సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాయి పల్లవి ప్రస్తుతం వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. తెలుగు, తమిళంతో పాటు బాలీవుడ్‌లోనూ పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో నటిస్తూ కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. అయితే తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రస్తుతం సాయి పల్లవి బాలీవుడ్‌లో రూపొందుతున్న 'రామాయణం' చిత్రంలో సీత పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో కనిపించనుండగా, ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే సమయంలో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా తెరకెక్కిన 'ఏక్ దిన్' సినిమాలో కూడా ఆమె నటించారు. ఇటీవల విడుదలైన 'ఏక్ దిన్' సినిమా ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన అందుకుంది. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సాయి పల్లవి సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించారు. "ఈ సినిమా చేయడానికి ప్రధాన కారణం కథే. భావోద్వేగాలతో కూడిన, మనసుకు హాయిగా అనిపించే పాత్ర చేయాలనిపించింది. షూటింగ్ సమయంలో కూడా మానసిక ఒత్తిడి లేకుండా ఉండే కథ కావాలనుకున్నాను. కథ విన్నప్పుడు హాలీవుడ్ చిత్రం 'బిఫోర్ సన్‌రైజ్' గుర్తుకు వచ్చింది. అందుకే వెంటనే అంగీకరించాను" అని తెలిపారు. అయితే సినిమా ప్రీమియర్ చూసిన తర్వాత తనకు భిన్నమైన భావన కలిగిందని సాయి పల్లవి చెప్పారు. "సినిమా చూసాక ఈ పాత్రకు నేను పూర్తిగా సరిపోలేదేమో అనిపించింది. ఇదే విషయాన్ని అమీర్ ఖాన్ గారితో కూడా చెప్పాను. నా బదులు మరింత చలాకీగా, ఉత్సాహంగా ఉండే కొత్త అమ్మాయిని ఎంపిక చేసి ఉంటే బాగుండేదేమో అనిపించింది" అని వెల్లడించారు. సాయి పల్లవి చేసిన ఈ నిజాయితీ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తన నటనపై స్వయంగా విశ్లేషించుకోవడం, పాత్రకు తాను ఎంతవరకు న్యాయం చేశానో బహిరంగంగా చెప్పడం ఆమె వ్యక్తిత్వాన్ని చూపిస్తోందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.





# అగధ టీజర్ విడుదల



కామాక్షి భాస్కర్ల ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'అగధ'. ఎమ్మెస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. విశ్వంలో ఎన్నో అతీత శక్తులు దాగున్నాయంటూ ప్రారంభమైన ఈ టీజర్ సినిమాపై ఆసక్తి కలిగిస్తోంది. 'అగధ' ముందు ఎవరి ఆటలు సాగవంటూ చెప్పే డైలాగ్ పాత్ర ప్రాధాన్యతను తెలియచేస్తోంది. ప్రతిక్షణం ప్రేక్షకుడికి ఉత్కంఠ కలిగించాలన్నదే తన ప్రయత్నమని డైరెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. విజువల్ ఎఫెక్ట్స్, గెటప్స్, ఆ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ , భయం గొలిపే లొకేషన్లు, విచిత్రమైన ఎక్స్ప్రెషన్స్ , మధ్య మధ్యలో ఆసక్తి రేకెత్తించే డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. 'ఆ వీడియోలో నువ్వు ఏం చూసావమ్మా' అని అడిగితే, ఒక అమ్మాయి భయంతో వణికిపోతూ 'అగ్... అగ్... అగధ' అని చెప్పడంతో 'అగధ' అంటే ఎవరు అనే ఆసక్తి కలుగుతుంది. 'అగధ' వచ్చేసిందమ్మా. 'అగధ' ముందు ఎవ్వరి ఆటలు సాగవు. రా... 'అగధా? రా'అంటూ వినిపించే డైలాగ్స్ తో టీజర్ తాలూకు ఉత్కంఠ పీక్ లెవెల్ కి చేరినట్టుగా అనిపిస్తుంది. త్వరలో ట్రైలర్ ను విడుదల చేయడానికి సన్నాహాలు చేసస్తున్నారు.



# శ్రియ అందాల మెరుపులు

హైదరాబాద్, మే 7: సీనియర్ హీరోయిన్ శ్రియ శరణ్ భారతీయ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. రెండు దశాబ్దాలకుపైగా సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అందం, అభినయం, గ్లామర్‌తో పాటు విభిన్న పాత్రలను పోషిస్తూ తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు. శ్రియ సినీ ప్రయాణం బాలీవుడ్ చిత్రం 'తుఝే మేరీ కసమ్'తో ప్రారంభమైంది. అనంతరం విక్రమ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇష్టం' సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. మొదటి సినిమాతోనే తన అందం, నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న శ్రియ.. ఆ తర్వాత వరుస అవకాశాలను అందుకున్నారు. తెలుగులో మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణ, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, మహేష్ బాబు వంటి అగ్రహీరోల సరసన నటించి స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, హిందీ, మలయాళ భాషల్లోనూ అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించి దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్‌లోనూ శ్రియ అదే జోష్‌తో కొనసాగుతున్నారు. స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రలు పోషించడంతో పాటు మహిళా ప్రాధాన్య కథల్లో నటిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. పాత్రల ఎంపికలో వైవిధ్యాన్ని చూపిస్తూ తన నటనతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఇప్పటికే ఆమె చేతిలో పలు ఆసక్తికర ప్రాజెక్టులు ఉన్నాయి. తమిళంలో 'నరగసూరన్', 'సందక్కారి', తెలుగులో 'ఆట నాదే వేట నాదే', అలాగే బాలీవుడ్‌లో అజయ్ దేవగన్‌తో కలిసి 'దృశ్యం 3' చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.వయసుతో సంబంధం లేకుండా గ్లామర్, ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ శ్రియ ఇప్పటికీ యువ హీరోయిన్లకు గట్టి పోటీ ఇస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా ఆమెకు భారీ ఫాలోయింగ్ ఉండగా, తరచూ తన స్టైలిష్ ఫొటోలతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు.

# నయన్ లైఫ్‌స్టైల్ ఖర్చుపై విఘ్నేష్ వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 7 :** దక్షిణాది సినీ పరిశ్రమలో 'లేడీ సూపర్ స్టార్'గా గుర్తింపు పొందిన నయనతార విలాసవంతమైన జీవనశైలి గురించి ఎప్పుడూ చర్చలు జరుగుతూనే ఉంటాయి. తాజాగా ఆమె భర్త, దర్శకుడు విఘ్నేష్ శివన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నయనతార సౌకర్యవంతమైన జీవితం గడపాలంటే రోజుకు ఎంత ఖర్చవుతుందనే అంశంపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నయనతార ప్రస్తుతం దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ అగ్ర నటిగా కొనసాగుతున్నారు. 'జవాన్' సినిమాతో వెయ్యి కోట్ల క్లబ్‌లో చోటు సంపాదించిన ఆమెకు దేశవ్యాప్తంగా భారీ అభిమాన వర్గం ఉంది. సినిమాలతో పాటు నిర్మాణ సంస్థలు, చర్మ సంరక్షణ ఉత్పత్తులు, ఇతర వ్యాపారాల ద్వారా కూడా భారీ ఆదాయం పొందుతున్నారు. చెన్నై, ముంబై, హైదరాబాద్, కేరళ వంటి ప్రాంతాల్లో నయనతారకు విలాసవంతమైన గృహాలు ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా ప్రైవేట్ జెట్ సహా పలు ఖరీదైన ఆస్తులు కూడా ఆమె సొంతమని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో విఘ్నేష్ శివన్ మాట్లాడుతూ.. "రూ.350 కోట్లను ఫిక్స్డ్ డిపాజిట్‌గా పెట్టగలిగితే మా కుటుంబం ఎంతో సంతోషంగా జీవించగలదు" అని అన్నారు. ఆ మొత్తం ద్వారా సంవత్సరానికి సుమారు రూ.21 నుంచి రూ.24 కోట్ల వరకు వడ్డీ వస్తుందని, దాన్ని నెలవారీగా లెక్కిస్తే దాదాపు రూ.2 కోట్ల వరకు వస్తుందని తెలిపారు. రోజుకు సుమారు రూ.6 నుంచి రూ.7 లక్షల వరకు ఆదాయం ఉంటే కుటుంబ అవసరాలు సౌకర్యంగా నెరవేరుతాయని పేర్కొన్నారు. ఇప్పుడంతా తాను సంపాదన పెంపుపైనే దృష్టి పెట్టినట్లు విఘ్నేష్ వెల్లడించారు. ఖాళీ సమయం దొరికినప్పుడల్లా వ్యాపారవేత్తలతో మాట్లాడి వ్యాపార సలహాలు తీసుకుంటానని చెప్పారు. అయితే రూ.350 కోట్ల లక్ష్యానికి ఎంత దగ్గరలో ఉన్నారనే ప్రశ్నకు మాత్రం చిరునవ్వుతో సమాధానం దాటవేశారు. సోషల్ మీడియాలో మాత్రం నయనతార జీవనశైలిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వ్యక్తిగత మేకప్ సిబ్బంది, స్టైలిస్టులు, భద్రతా సిబ్బంది, ఫోటోషూట్లు, ప్రయాణాలు, విలాసవంతమైన నిర్వహణ ఖర్చులు కలిపితే రోజువారీ ఖర్చులు భారీగానే ఉంటాయని నెటిజన్లు అంచనా వేస్తున్నారు. అయితే డబ్బు కంటే వ్యక్తిగత గోప్యత, సౌకర్యాలకు నయనతార ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. విఘ్నేష్ వ్యాఖ్యలపై నయనతార మాత్రం ఇప్పటివరకు ఎలాంటి స్పందన ఇవ్వలేదు.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.